క్లుప్తంగా

సీఐ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



సీఐ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: ఇటీవల తీవ్ర గుండెపోటుతో హఠార్మణం చెందిన ఆత్మకూరు సీఐ ఎం నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శనివారం పరామర్శించారు. పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లిలోని సీఐ ఇంటి వద్దకు వెళ్లి ఆయన భార్య, మిగిలిన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని ప్రభుత్వ పరంగా రావాల్సిన బెనిఫిట్స్‌ని త్వరగా అందేలా తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఆయన వెంట సంగం సీఐ రవినాయక్, ఎస్సై ఎం.శివశంకర్ రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పోలు చిన్నపరెడ్డి, తోకల వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రమీల

ఆత్మకూరురూరల్: మండలంలోని చెర్లోయడవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రవాస భారతీయురాలు డాక్టర్ ప్రమీల మదమాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఆలంబన ఫౌండేషన్ ఇండియా రోగులకు అవసరమైన మందులు సరఫరా చేశారు. మాజీ సర్పంచ్ కేతా విజయభాస్కర్‌రెడ్డి, సచివాలయ వైద్య సిబ్బంది షంషాద్‌బేగం, మాధురి, కాంతమ్మ, స్థానిక నాయకులు అంబటి రాధాకృష్ణారెడ్డి, అల్లంపాటి ధనుంజయరెడ్డి, రామిరెడ్డి అశోక్ రోగులకు సహాయ సహకారాలు అందజేశారు.

రేపు గంధమహోత్సవం

ఉదయగిరి: పట్టణంలోని కోనకాలువ సమీపంలో ఉన్న హజరత్ సూఫీ మొహమ్మద్ జైనుల్లా బీదీన్ ఖాదరివుల్ చిష్టిబాబా (ఆబీద్‌బాబా) 20వ ఉరుసు గంధమహోత్సవం సోమవారం జరుగుతుందని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హక్కుదారులైన సయ్యద్ అన్సారీ హుస్సేనీ ఇంటి వద్ద నుంచి గంధం సోమవారం అర్ధరాత్రి ఊరేగింపుగా ఫకీరుల జరబులు, విద్యుద్దీపాలంకరణతో, తాషా బ్యాండ్‌లతో వైభవంగా మంగళవారం వేకువజామున దర్గా చేరుతుందన్నారు.

పది పరీక్ష కేంద్రాల తనిఖీ

ఉదయగిరి: ఉదయగిరి, సీతారాంపురం మండలాల్లోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి భిక్షాలు తనిఖీ చేశారు. ఆయన సీతారాయపురం, ఉదయగిరి, గండిపాళెం కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి తెలిపారు.

టీకా కార్యక్రమం పరిశీలన

మర్రిపాడు: మండలంలోని చాబోలు అంగన్‌వాడీల కేంద్రంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం హెల్త్‌సూపర్‌వైజర్ షేక్ ఖాజామొహిద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా టీకాలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ భూలక్ష్మి, ఏఎన్‌ఎం రసూల్ బీ, అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

ఆస్థాన సిద్ధాంతికి ఘన సన్మానం



ఆత్మకూరు: శృంగేరి విరూపాక్షపీఠం ఆస్థాన సిద్ధాంతి జాగర్లపూడి ప్రవంతిని బ్రాహ్మణ సేవా సంఘం, గాయత్రి సేవా సహకార ట్రస్ట్ నిర్వాహకులు శనివారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని సుందరమ్మ కోదండ రామాలయంలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ చిన్న వయసులోనే ప్రఖ్యాత విరూపాక్ష పీఠం ఆస్థాన సిద్ధాంతి కావడంతో గొప్ప విషయమని, దీనికి తోడు పంచాంగం రాసిన మొదటి మహిళగా ఆమె పేరు తెచ్చుకుందని కొనియాడారు. చక్రవర్తి, సంగీత నృత్య విద్యాలయం నిర్వాహకురాలు అపర్ణ, రామయ్యస్వామి, నాగరాజాశర్మ మధుసూదన్ శర్మ పాల్గొన్నారు.

ఉచిత మెడికల్ క్యాంపు

అనుమసముద్రంపేట: మండలంలోని కొత్తపల్లిలో ఆగ్నేష్ మల్టీ పర్పస్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు, హ్యూమన్ రైట్స్, అఫెన్స్ కంట్రోల్ కమిటీ నెల్లూరు జిల్లా చైర్మన్ కానగల వెంకటరమణయ్య ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ ఆఫ్ ఆగ్నేస్ చారిటబుల్ ఫౌండేషన్ వారి సహకారంతో శనివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. పీఎంపీ అసోసియేషన్ ఆత్మకూరు డివిజన్ కోశాధికారి పద్మావతి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కొత్తపల్లి ఎంపీటీసీ సూరా వెంకటసుబ్బమ్మ, సర్పంచ్ చిప్పు ఓబులమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు చిలకా కృష్ణారెడ్డి, స్థానిక సచివాలయం ఏఎన్‌ఎం శేషమ్మ, ఆశ వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యం

- రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు
- పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన



కావలి: వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, పేదల సంక్షేమం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి మండల పరిషత్ కార్యాల ఆవరణలో వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుతో కలిసి ఎమ్మెల్యే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారీగా తరలివచ్చిన మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం మంత్రి కాకాణి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుతో కలిసి 1,148 పొదుపు సంఘాలకు లబ్ధి చేకూరేలా రూ.8.67 కోట్ల చెక్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా, ప్రతి పేద కుటుంబానికి పథకాలు అందించాలనే లక్ష్యంతో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను కూడా ప్రారంభించారని తెలిపారు. సచివాలయాల ద్వారా పూర్తి పారదర్శకంగా పథకాలు అందజేస్తుండడంతో పేద కుటుంబాలన్నీ సంతోషంగా ఉన్నాయని వివరించారు. వలంటీర్లు నేరుగా పేదల ముంగిటకే వెళ్లి పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఈ తరహాలో పేదల ఇంటికే పథకాలు తీసుకువెళుతున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి పేదకుటుంబానికి సొంత ఇళ్లు ఉండాలనే సంకల్పంతో అన్నీ వసతులతో కూడిన లేఅవుట్‌లు ఏర్పాటు చేసి పేదలకు పక్కా ఇళ్లు కూడా కట్టిస్తున్నట్లు తెలిపారు. పేదింటి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలక దీటుగా తీర్చిదిద్దడం, దశబ్దాలుగా ఉన్న భూసమస్యలు పరిష్కరించి ప్రభుత్వ ఖర్చుతోనే హద్దు రాళ్ళు వేయించేలా రీసర్వే పక్రియ చేపట్టడం, రైతుల కోసం గ్రామాల్లో ఆర్బీకేలు, మహిళల కోసం ఆసరా, ఇతర స్వయం ఉపాధి పథకాలు, విద్యార్థుల కోసం విద్యాదీవెన, వసతిదీవెన, తదితర పథకాలు, ఇంటి వద్దకే పింఛన్లు, తదితర పథకాల పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని వివరించారు. ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీకే శీనానాయక్, వివిధ శాఖల అధికారులు, స్థానిక సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికి రాజకీయ పార్టీలు, కులమతాలకతీంగా సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రంలో జనరంజక పాలన కొనసాగిస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని మాముడూరు సచివాలయ పరిధిలోని నడిగడ్డ అగ్రహారంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం అందజేసిన పథకాలకు సంబంధించి అందించిన సంక్షేమ ఫలాల వివరాలతో కూడిన బుక్‌లెట్ అందజేశారు. ఎమ్మెల్యే విక్రమ్ మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు వివరించేందుకు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నట్లు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు, స్థితిగతులను మార్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి విపరీతమైన మద్దతు లభించిందన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలన్నీ మా నమ్మకం నువ్వే జగన్ అనే భరోసాతో ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారని, ప్రతి ఒక్కరిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రణాళికలు రూపొందించారన్నారు. తాము ప్రతి ఇంటికి వెళ్లినప్పుడు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూస్తే గర్వంగా ఉందన్నారు. మహిళా అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని అమ్మఒడి, విద్యాదీవెన, పావలా వడ్డీ, పొదుపు రుణమాఫీ, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలతో ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. మరోమారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామని ముక్త కంఠంతో చెబుతున్నారని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పూనూరు రామమనోహర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ బి.రమాదేవి, పార్టీ మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, మండల సొసైటీ అధ్యక్షుడు బూదళ్ల వీరరాఘవరెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ సిరాజుద్దీన్, ఎంపీడీఓ విజయలలిత, తహసీల్దార్ శివకృష్ణయ్య, డీటీ విజయ్, నాయకులు రాంబాబు, జయంత్ రెడ్డి, జయదీప్‌రెడ్డి, మాముడూరు సర్పంచ్ దాచూరు చిన్నయ్య, ఏటూరు సర్పంచ్ ఉగ్గుమూడి రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా జగనన్నే మా భవిష్యత్

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన పట్టణ పార్టీ నాయకులు, కౌన్సిలర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ప్రజా మద్దతు పుస్తకం ద్వారా ప్రజల నుంచి గత పాలన కంటే ప్రస్తుత పాలనలో అందుతున్న పింఛన్లు, అమ్మఒడి, ఆసరా చేయూత, విద్యాదీవెన, వసతి దీవెన, పొదుపు రుణమాఫీ, తదితర సంక్షేమాలు, అభివృద్ధి గురించి తెలిపి ప్రజల అభిప్రాయం నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, ఐవీ రమణారెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, సయ్యద్ జమీర్, సుబ్బారెడ్డి, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



సంగం: సంగం పెన్నా నది తీరాన కొలువైన కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామి, అమ్మవార్లకు శుక్రవారం రాత్రి అశ్వవాహన సేవ నేత్రపర్వంగా నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పెరుమాళ్ల రవీంద్రబాబు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

నూరు శాతం టీకాలు

వరికుంటపాడు: మండలంలోని ఆరోగ్య, ఆశ కార్యకర్తలు వారి పరిధిలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నూరు శాతం టీకాలు అందించాలని స్థానిక పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజశేఖరరాజు అన్నారు. ఆయన శనివారం మండలంలోని భోగ్యంవారిపల్లెలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం తనిఖీచేసి రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు అందించారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

క్రీడల్లోనూ సత్తా చాటాలి



క్రీడాకారులతో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటి కావలి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లా లెదర్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. యువతతో కలిసి కొద్దిసేపు క్రికెట్ ఆడి అందరినీ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపే విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించడంతో పాటు ఉద్యోగాల పరంగా కూడా ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కావలి రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు ఈతముక్కల బాలమురళీరెడ్డి, నాయకులు కుందుర్తి కామయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా మెగా నమూనా చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: రాష్ట్రంలో మహిళలు ఆర్థిక సాధికారత సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శనివారం ఏఎస్‌పేట ఎంపీడీఓ కార్యాలయంలో మూడో విడత ఆసరా పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల ఉజ్వల భవితకు పెట్టుబడి అని తెలిపారు. మండలంలో మూడో విడతగా 507 స్వయం సహాయక సంఘాల్లోని 5,572 మంది లబ్ధిదారులకు రూ.14.13 కోట్ల ఇప్పటికే మహిళల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని వివరించారు. ఎండను సైతం లెక్క చేయకుండా ఇంత మంది మహిళలు జగనన్ను దీవించేందుకు రావడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. మహిళా అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ఆసరా పథకం వల్ల ఎంతో మంది మహిళలు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని తెలిపారు. పిల్లలను నూటికి నూరుశాతం చదివించుకోవడం వల్ల దేశంలోనే చదువులో ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. ఇది ఓర్వలేని టీడీపీ నాయకులు లేనిపోని అబద్ధాలు సృష్టిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో సైతం ప్రతి మహిళ జగనన్నను దీవించాలని, తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రతి మహిళ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, సచివాలయ కో–ఆర్డినేటర్ పులిమి వెంకటరమేష్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సంధాని, ఎంపీడీఓ భాస్కర్, ఏసీ వెంకటేశ్వర్లు, ఏపీఎం సతీష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీ నాయకులు సిరిగిరి వెంకటేశ్వర్లురెడ్డి, జనార్దన్‌రెడ్డి, కోటిరెడ్డి, జిలానీ, బోయళ్ల చెంచురెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే ప్రజలకు మంచి భవిష్యత్తు

- మెట్టుకూరు ధనుంజయరెడ్డి



టెంకంవారిపాలెంలో కరపత్రం అందిస్తున్న ధనుంజయరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంటేరు



కలిగిరి: విద్యార్థులతో ముచ్చటిస్తున్న మెట్టుకూరు చిరంజీవిరెడ్డి

జలదంకి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది పేదల ప్రభుత్వమని, ఆయన పాలనలోనే ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి అన్నారు. శనివారం వారు మండలంలోని టెంకంవారిపాళెం, అప్పారావుసంఘం గ్రామాల్లో కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చేవూరు జనార్దన్‌రెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డితో కలిసి జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా జలదంకి బస్టాండ్ సెంటర్లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టెంకంవారిపాళెంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో చర్చించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పనులను, గత ప్రభుత్వంతో పోల్చి తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పతకాలను వివరించారు. జగన్ ప్రభుత్వంలో మంచి జరిగిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. క్యాలెండర్లు, డోర్ స్టిక్కర్లు, ఫోన్ స్టిక్కర్లు అంటించి మిస్డ్‌కాల్ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, గుర్రం జగ్గయ్యనాయుడు, వర్ధినేని మురళి, గండు కృష్ణారెడ్డి, పులింబాబుల్‌రెడ్డి, జలదంకి, జమ్మలపాళెం సర్పంచ్‌లు చలంచర్ల అనూరాధ, బుర్రి శ్రీవేణి, వట్టికాల బాలయ్య, టక్కోలు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వింజమూరులో

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు–1 సచివాలయ పరిధిలో శనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. ప్రతి ఇంటికీ వెళ్లి గత ప్రభుత్వం అమలు చేసిన, ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల తేడా గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, వింజమూరు సర్పంచ్ నల్లగొండ్ల సుజన, సచివాలయ కన్వీనరు మందాడి బ్రహ్మారెడ్డి, ఇతర నాయకులు ఏ.శ్రీనివాసులురెడ్డి, బి.విజయకృష్ణారెడ్డి, నజీర్, ఖాజా, అంకినపల్లి నారసింహారెడ్డి, పి.మధు, గృహసారథులు పాల్గొన్నారు.



కుమ్మరకొండూరులో ..

కలిగిరి: మండలంలోని కుమ్మరకొండూరులో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలును వివరించారు. 'జగనన్నే మా నమ్మకం' స్టిక్కర్లను ఇళ్లకు అంటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నోటి జనార్దన్‌రెడ్డి, మార్లేళ్ల మధుసూదన్‌రెడ్డి, అక్కెం హజరత్‌రెడ్డి, ఇర్మియ, తిరుపాలు, ఖాజామెయినుద్దీన్ పాల్గొన్నారు.

చీమలవారిపాళెంలో..

మండలంలోని నాగసముద్రం పంచాయతీ చీమలవారిపాళెంలో ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, ఎంపీపీ శిరీష ఆధ్వర్యంలో శనివారం 'జగనన్నే మన భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును వివరించారు. ప్రజల నుంచి జగనన్న పాలన గురించి అభిప్రాయాలు సేకరించారు. సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు రాగయ్య, స్థానిక నాయకులు చిన్నమాలకొండారెడ్డి, మాజీ ఎంపీపీ నందిపోగు జయమ్మ పాల్గొన్నారు.

వార్డుల్లో 'జగనన్నే మా భవిష్యత్తు'

ఆత్మకూరు: అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నే మన భవిష్యత్ అంటూ ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో పార్టీ నాయకులు శనివారం ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య స్థానిక నాయకులతో వార్డు కౌన్సిలర్లతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేసి ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమాల్లో నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ బాబు, సుజాత, సయ్యద్ జమీర్‌బాషా, ఎస్.శీనయ్య, వల్లెపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జగన్నతోనే అభివృద్ధి సాధ్యం

మర్రిపాడు: రాష్ట్రంలో అన్ని కుటుంబాలకు సంక్షేమ పథకాలు అంది అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని జేసీఎస్ కో ఆర్డినేటర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిలకపాడు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధంరెడ్డి రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధిని వివరించేందుకే..

సోమశిల: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేసిన సంక్షేమం అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా వివరించేందుకే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల జేసీఎస్ కో–ఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వరికుంటపాడు, గౌరవరం గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరికుంటపాడు సర్పంచ్ రాపూరు ఇంద్రావతమ్మ, శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు, పాతపాటి పెంచలరెడ్డి, భక్తవత్సలరెడ్డి ఉన్నారు.

వాడవాడలా 'జగనన్నే మా భవిష్యత్తు

ఆత్మకూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని ఊరూరా నిర్వహించారు. బట్టేపాడులో సొసైటీ అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెమ్మసాని శ్రీనివాసులునాయుడు, సర్పంచ్ చెరుకూరు చిన చెంచయ్య, మహిమలూరు, చెర్లోయడవల్లిలో సర్పంచ్‌లు పట్టెడ చంద్రశేఖర్, బొలిగర్ల వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు రావూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పాలన.. జగనన్నే మా భవిష్యత్తు

అల్లూరు: రాష్ట్రంలో సంక్షేమ పాలనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరోసారి రావాల్సిన అవసరం ఉందని అల్లూరు మండల జేసీఎస్ కన్వీనర్ షేక్ ఉస్మాన్ షరీఫ్ అన్నారు. శనివారం అల్లూరు మండల వ్యాప్తంగా స్థానిక నాయకులు ముమ్మరంగా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న పాలనను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, దైవాదీనం, గోళ్ల రాజేష్, నిమ్మల భాస్కర్, అల్లూరు–1 సచివాలయ కన్వీనర్లు బి సుధా, షేక్ జంషీర్ పాల్గొన్నారు.

'వందేభారత్'కు ఘనస్వాగతం



వందేభారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న రాజ్యసభ సభ్యుడు బీద, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



స్థానికులతో కిక్కిరిసిన ప్లాట్‌ఫాం

బిట్రగుంట: బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో వందేభారత్ రైలుకు శనివారం ఘన స్వాగతం లభించింది. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వందేభారత్ ప్రారంభించిన సందర్భంగా ప్రయాణికుల సందర్శనార్థం బిట్రగుంటలో కొద్దిసేపు నిలపనున్నట్లు రైల్వే అధికారులు రెండు రోజుల క్రితమే ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో సాయంత్రం ఐదు గంటల నుంచే స్థానికులతో రైల్వేస్టేషన్ ప్రాంగణం కిటకిటలాడింది. వేలాదిగా తరలివచ్చిన బిట్రగుంట వాసులు, రైల్వే కార్మికులు, విశ్రాంత రైల్వే ఉద్యోగులు పూలు జల్లుతూ వందేభారత్‌కు ఘనస్వాగతం పలికారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వీకే శీనానాయక్ బిట్రగుంటలో వందేభారత్‌కు పచ్చజెండా ఊపి నెల్లూరు వరకు ప్రయాణించారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

సోమశిల: అనంతసాగరంలోని మద్రాసా యే మష్కూరియా దర్గా 28వ వార్షికోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతులు సానీసాహెబ్, మజీద్‌సాహెబ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులకు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఉపవాస దీక్షల్లో ఉండే ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

బోర్లకు శంకుస్థాపన



ఆత్మకూరురూరల్: మండలంలోని ఆరవీడు, చెర్లోయడవల్లి, అప్పారావుపాళెం, దేపూరు, బోయలచిరివెళ్ల, గొల్లపల్లి గ్రామాల్లో బోర్ల నిర్మాణానికి శనివారం ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఒక్కొక్కటి రూ.1.20 లక్షల వ్యయంతో జెడ్పీ సాధారణ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సూరం ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెమ్మసాని శ్రీనివాసులునాయుడు, దనాల రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పార్వేట ఉత్సవం

వింజమూరు (ఉదయగిరి): శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పార్వేట ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉభయకర్త వెలుగోటి రాములు ఇంటి నుంచి చెన్నకేశవస్వామి దేవస్థానానికి ఊరేగింపుగా భజంత్రీలు, బాణసంచా పేలుస్తూ కనుల పండువగా సాగింది. అనంతరం స్వామివారిని, అమ్మవారిని అశ్వ వాహనంపై ఉంచి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం చెన్నకేశవ స్వామి దేవస్థానం నుంచి ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న జమ్మి చెట్టు వరకు ఉత్సవ ఊరేగింపు జరిగింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.